# పాఠాలు నేర్పడానికి పద్ధతులున్నాయి

## సత్యం

పేరునుపట్టికాదు గాని, పద్మను పిరికని పిలుస్తాము మేమంతా— అసలావిడ మామూలు పిరికికూడా కాదు. ఖర్మంచాలక ఏ కొత్తముఖమైనా కనబడిందా, తుదకు ఏ బిచ్చగాడైనా వాకిటముందు కనపడ్డాడా ఒక దూకుతో వెళ్లి మంచంమీదపడి కళ్లు మూసుకుంటుంది.

పద్మ పిరికితనం యీస్థితికి రావడానికి కారణమూవుంది. పద్మ ముఖంమీద ఎవరి దృష్టైనాపడిందంటే అది త్వరగా వెనక్కు తిరగదు; సరిగదా అక్కడే తావరమేర్పరచుకోవాలని తంటాలుపడుతుంది. అయితే అది అక్కడ సన్మానంపొందక తిన్నగా మరలిపోతుంది సిగ్గుతో.

అందుకనే పద్మ రిక్షా ఎక్కిందంటే ముఖం దాచుకుంటుంది గొడుగుతో. అడిగినవారికి 'ఎండకు తలనొప్పి వస్తుంది గొడుగు పట్టుకోనకపోతే' అంటుంది; కాని అసలు కారణం అదికాదు. దారిని వెళ్లేటప్పుడు చాలామంది పాపిష్టిచూపులు పారవేస్తుంటారు ఆడవాళ్లమీదికి. వాళ్లయిల్లు బంగారంగాను వారి కదొకసరదా. పాపం పద్మ బైటపోయినప్పుడంతా యీ దౌష్ట్యానికి గురిఅవుతూవుండేది. అయినా ఆమె శత్రువునుకూడా పల్లెత్తుమాటా అనదు, పిసరంత ధైర్యమూ తెచ్చుకోదు తుదకు తన్నెవరైనా నొప్పించినా మాటాడదు. ఎవరైనా వారి నడుగుదాము 'అలా చేయడమెందుకో' అంటేకూడా వప్పుకోదు. పోనీ వూరకుంటుందా అంటే కుమ్మరివాములాగ కుములుతూవుంటుంది.

* * * *

ఆవేళ నేనే ముందొచ్చాను స్కూలునుండి. ఫలాహారం ప్రారంభించబోతూవున్నాను. ఇంతలో లోపలనుండివచ్చి పద్మ 'చూడక్కయ్యా ఎంతసాహసమో?' అంటూ నామీదికొకకవరు విసరివేసింది. ఆవిడముఖం చూస్తే నాకు భయమేసింది. ఎంతగా ఏడ్చిందో కాని కళ్లు ఎఱ్ఱగా వున్నయి. ముఖమంతా కందిపోయింది. ముసలాడి కర్రలా శరీరం వణకుతూవుంది. పిల్లల తప్పటడుగుల్లాగ మాటలు జారుతున్నాయి. ఆ కవరును గురించిన నాలుగుముక్కలు చెప్పేసింది; ముఖంకప్పుకుని ఏడ్చింది.

జరిగిన సంగతిది. ఆవేళ పద్మ యథాప్రకారంగా రిక్షాలో హాస్టలుకు వస్తూవుంది. దారిలో టీకుటాకుగావున్న ఓ నవయువకుడు రిక్షాను సమీపిం

ప్రపంచానుభవమూ వుండదు ; పరిశీలనా పనికి రాదు ; ప్రజ్ఞా వుపయోగించదు. వయోప్రకృతి ననుసరించి హృదయములోనుంచి ఉవ్వెత్తుగా ఉబుకుతూవచ్చే ఉద్రేకాలను 'పోయినట్లే పోని'వ్వాలి. ఇది కొందరి యువకుల ప్రకృతి. ఫలితము బాధాకరము. ఇతర హృదయాలే గాదు, ఉద్రేకములో ఉఱ్ఱూతలూగిన హృదయము కూడా పశ్చాత్తాపాగ్నిలో బడి మ్రగ్గవలసి వస్తుంది. ఆలాంటి సమయాల్లో ఇతరులు కూడా బుజ్జిలను ఉడికించుకోనకుండా శాంతంగా వారికి పాఠాలు నేర్పడం బాగుంటుంది' అంటారురచయితగారు

చాడు. ఒక కవరు పద్మ కందించబోయాడు. పద్మ కా ముఖం పరిచయంలేదు. "ఎక్కడిది? ఎవరిచ్చారు? ఎవరికి?" అని ప్రశ్నించింది పద్మ. బదులుమాట వచ్చిందికాదు. పద్మ రిక్షావాణ్ణి నడవమంది. కాని యువకుడు కవరును గభాలున పద్మమీద పడవేసి వెళ్లిపోయాడు!

కవరుపైన విలాసంలేదు. లోపలి వుత్తరంలో సంబోధనాలేదు. కాని అందులోని విషయాలు పద్మను సంబోధించేవున్నాయి. ఉద్రేకాల్ని అణచుకోలేని యువకుల ప్రేమలు దాన్లోవుంది. క్రింద వ్రాసినవారి పేరు—రామారావు—వుంది. విలాస మేమో కేరాఫ్ పోస్టుమాస్టరు.

ఇదంతాచూస్తే నాకు వళ్లు మండింది. వాడి కేలాగైనా తగినపాఠం చెప్పి లెంపలు వాయింపించాలనుకున్నా. అయితే అల్లరౌవుతుందని పద్మ గోల చేస్తుంది. గోల జరగకుండానే వాడి దుడుకుతనానికి తగిన ప్రతిక్రియ చేయిస్తానని పద్మను ఏలాగో వప్పించాను.

*   *   *

మా పెత్తల్లికొడుకు ప్రసాదరావు, పద్మ మేనత్త కుమారుడు సూర్యప్రకాశరావూ ఇద్దరుకూడా కాలేజి హాస్టల్లో వున్నారు. నేను వేసిన ఎత్తు సాగాలంటే వారి సాయం కావాలి. అంచేత వారికి కబురంపాను.

వారు వచ్చారు. పద్మ వారితో మాట్లాడనైనా లేదు. సిగ్గుతో పడుకొంది. నేనే వారికి జరిగిన కథంతా చెప్పాను. ఆఖరున నా ఎత్తుకూడా తెలియపరచాను. వారిని సాయం చేయమన్నాను.

వారిద్దరూ చిచ్చుబుడ్లే. కథంతా విని వారెగిరిపడ్డారు. రామారావెవరో వారికీ తెలియదు. వాణ్ణి పిండిక్రింద దంచేస్తామని హుంకరించారు. వారినెలాగో సమ్మతింపచేసి నాఎత్తు సాగనిమ్మని ప్రార్థించాను. వారిని వప్పించి రామారావుకు పద్మ వ్రాసినట్లు ఇలా వుత్తరం వ్రాయించాను.

రామారావుగారికి,

మీ వుత్తరం చదివాను. సంతోషము. మీరు అనాలోచితముగా మధ్యదారిలో తారసిల్లారు. వచ్చే ఆదివారం మీ రిక్కడికి దయచేస్తే బాగుంటుంది. విజిటర్సు టైములో రావచ్చు. వస్తారనుకుంటాను.

ఇట్లు,

మాయావతి.

*   *   *

ఇలా ఏర్పాటులేమో ముగిశాయి. అయితే మా యిద్దరికీ ఓ కొత్తభయం ఆవేశించింది. జరిగిన పరాభవాన్ని భరింపలేక ప్రతీకారం చేయాలన్న ఆదుర్దాతో జరిగిన సంగతంతా ప్రసాద, సూర్యప్రకాశరావులతో చెప్పాము. వారేమో రామారావును వూరికే విడువరు. వారు రామారావును చావగొట్టి చెవులుమూస్తే? ఎంతగోల? ఎంతగొడవ?

పైగా అంతా మమ్మల్నే అంటారుగదా ఆడవాళ్ల అహంకారమే కారణమని!

అయితే దీనికేమైనా అర్థమూ ఆధారమూ వుందా?

అమాయికురాలై ఎవరి ప్రసక్తిలేని ఒక అమ్మాయికి అతిసాహసముతో ఓ బుద్ధిమంతుడు వుత్తరం వ్రాశాడు. పట్టపగలు హైరోడ్డుమీద ఎదురుగా పోలీసువుండగానే మీదపడవేశాడు!! ఎంత నీచుడు గాకపోతే అంత సాహసం? ఈ మూర్ఖుణ్ణి మందలించకుండావుందామా అంటే—మరీవచ్చి వాడిలాగే అల్లరిచేయడం సాగిస్తే? ముందేనిలబడి తగిన శాస్తి చేద్దామా అంటే పద్మ కా ధైర్యమూలేదు; ఏలాగో కలిగిస్తామా అంటే తరువాత సంఘమేమంటుంది? ఎవరిమీద తప్పు మోపుతుంది?

ఈ యాలోచనలే మమ్మల్ని కలవరపెడుతున్నాయి. ఆదివారం వచ్చినది. మా ఆందోళన

మరింత అధికమైంది. నిర్ణీతసమయం దగ్గరిస్తూవుంటే గుండెల్లో రైళ్లు పరుగెత్తడం మొదలెట్టాయి మా యిద్దరికీ.

అనుకున్నట్లుగా ప్రసాదరావు సూర్యప్రకాశరావు సాయంత్రం నాలుగింటికే వచ్చారు. పద్మ పైననేవుంది. నేనుమాత్రం వారితో విజిటర్సు రూములోవుండి మాట్లాడుతున్నా.

రామారావు వస్తే పశ్చాత్తాపపడేటట్టు చేయాలి గాని దురుసుగా చేతులు చేసుకోవద్దని మాతమ్ముణ్ణి, ప్రకాశరావును ప్రార్థించాను.

ఇక రామారావు రావాలి.

ప్రతిక్షణమూ ఎంతమాత్రం చప్పుడైనా ఆ కొత్త మనిషి రామారావేమో అని తిరిగి చూస్తున్నాము.

విజిటర్సు టైము దాటిపోయింది.

ఏడు గంటలైంది. రావుగారు రాలేదు.

*    *    *

కారణమేమిటి? రామారావు మాఎత్తు పసి పట్టాడా? మరి రాకపోవడం దేనికి? లేక వచ్చి చూచి మేమంతావుంటే వెళ్లిపోయాడా? ఏమో మేమెవరూ అతడెలాంటివాడో ఎరగముగా!!

మరుదినం సాయంకాలం ఎవరో మిత్రులు వస్తే విజిటర్సురూములో మాట్లాడుతూవున్నా. ఒక నూతన వ్యక్తి టిప్‌టాప్ వేషంతో హేట్ చేతిలోపట్టుకుని లోపలికి వచ్చింది.

మనిషేమో బాగానేవున్నాడు. అయినా ధైర్యాన్నిమాత్రం వెనకవిడిచి వచ్చినట్లుంది.

"ఎవరు కావాలండి" అని ప్రశ్నించాను.

ఇటునటుచూస్తూ పెదవులు తడుపుతూ "మాయావతిగారి కోసరమండి" అన్నాడు.

ఓహో! రామారావుగారా! పాపం అతనికి పద్మ పేరుగూడా తెలియదు.

నాగుండె ఎందుకో దడదడమంది.

"కూర్చోండి. పిలుస్తాను" అని ఒక్కదూకుతో పైకివెళ్లి పద్మ చెవులో వూదాను. పద్దమ్మ పెద్దమ్మ మొగముపెట్టింది. భయపడసాగింది. సరే ఆవిడతో ఆలోచించడం అనవసరమని దిగివచ్చాను; మరి ఏదో కథ సాగనీవద్దూ?

"మీరు నిన్న వస్తారనుకున్నారట. ఈవేళ వారికి తలనొప్పిగావుందట. మీకు కష్టంగా లేకపోతే గురువారం రమ్మన్నారు యీవేళకే" అన్నాను.

ఆతని ముఖంలో కొంచం వెలుగు కనపడ్డది. ముందుదినం ఎందుకు రాకపోయానా? అన్నట్టు తల వూపాడు.

"వస్తానండి. థ్యాంక్స్" అంటూ బైటికి వెళ్లిపోయాడు.

*    *    *

ఆసంగతి ప్రసాదరావు సూర్యప్రకాశరావుగారలకు తెలియపరచాను.

ఈమారు గాలానికి చేప చిక్కుపడవలసిందే.

గురువారం వచ్చింది. సాయంకాలం సకాలానికే మాతమ్ముడూ సూర్యప్రకాశరావూ వచ్చారు.

వ్యూహపుటేర్పాట్లను గురించి మాట్లాడుతూవున్నాము. ఇంతలోకే నీటుగా డ్రస్ చేసుకుని రామారావుగారు దయచేశారు.

ఆతనికోసరం కాచుకున్న వారిద్దరూ నా కనుసైగతోనే తెలుసుకున్నారు వ్యక్తిని. అయితే వారిద్దరేమిటి పానకంలో పుడకల్లాగ అనుకున్నాడేమో అయిష్టం అతని ముఖంలో కనపడింది. అంతేగాకుండా ఎదురుగావున్న ఇద్దరి తీక్ష్ణమైన చూపులు అతని కంత ఇష్టంగాలేవు.

"ఏమండీ మాయావతి—" అని సన్నని గొంతుతో నావంక చూసి ఏమిటో అనబోయారు.

"మాయావతితో తరువాత మాట్లాడవచ్చునుగాని ఇలా దయచేయండి. తామే ననుకుంటూ రామారావుగారు" అన్నాడు మాతమ్ముడు. ఆతని లోపలిదీపం గభాలున ఆరిపోయివుండాలి, ఒక్కసారుగా రామారావు ముఖం నల్లబడింది. మనసులోని ఆశ్చర్యమూ, భయమూ కళ్లల్లోనుంచి పొడుచుకొని బైటికి వస్తున్నాయి. ముఖంలో చెమటలుకూడా పోశాయి.

ఇంతలోపల సూర్యప్రకాశరావు కమ్ములతలుపు మూసి దాని కడ్డంగా నిలబడ్డాడు. ప్రసాదు కుర్చీలోనుంచి లేచాడు. నేను కొయ్యలాగ నిలబడి వున్నా.

"ఇలా దయచేయండి కుర్చీమీదికి" అన్నాడు ప్రసాదు.

ఎన్నో కలలుగంటూవచ్చిన అతనికి ప్రాణాలు పైననే పోయాయి. కూర్చున్నాడు.

"మాయావతి మీ కేం గావాలండీ? మీ కావిడ ఎలా తెలుసు? ఎన్నిమార్లు వచ్చారేమిటి ఇక్కటికి?" అతనికి ఇలాంటి ప్రశ్నలు వెక్కిరించినట్టు వేస్తున్నారు వారిద్దరు.

ఒకవూపు వూపుదాం యీ భూతాలేమైనా వదలుతాయేమో అనుకున్నాడేమో "ప్రశ్నించటానికి మీ రెవరండి?" అని గొంతు సవరించుకుంటూ లేచాడు రామారావు.

ఇక మావాళ్లకు వళ్లు తెలిసిందికాదు. ఏయుద్ధం చూడవలసివస్తుందో అని భయపడి మా తమ్ముణ్ణి వెనక్కి లాగాను.

వాడు సింహంలాగ రొప్పుతూ "యీ వుత్తరం ఎవరు వ్రాశారో చూడు. దాన్ని మేము విచారించదలచుకొన్నాం" అన్నాడు వుత్తరం రావు ముఖాన పారవేస్తూ.

రామారావు నిలువునా నీరైపోయాడు. కుర్చీ మీద మరీ కూలబడ్డాడు. తలక్రిందికి వాలిపోయింది. కన్నీళ్లు రాల్చడానికి ప్రారంభించాడు. లేచాడు. రెండు చేతులు జోడించాడు. "పొరపాటు. క్షమించండి" అన్నాడు తలవంచుకునే.

ఆస్థితిచూస్తే ఎంతో జాలివేసింది.

ఆగ్రహం పట్టలేక యిద్దరూ తీక్ష్ణంగా కొన్ని మాటలు రామారావుమీదికి వదలారు.

అతడు వంచినతల పైకెత్తలేదు. కిక్కురుమనలేదు.

మాతమ్ముడొక కప్పు కాఫీ తెప్పించాడు. రామారావు ముందుంచి త్రాగమన్నాడు.

అతడు నీళ్లునిండిన కన్నులతో మమ్మల్ని చూచాడు. ఏమనుకున్నాడో ఏమో? నెమ్మదిగా కాఫీని త్రాగివేశాడు.